ప్రజాభవన్ ప్రజావాణి 11కు వాయిదా

రంగారెడ్డి, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ)/వికారాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 11కు వాయిదా వేసినట్లు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక , ప్రతీక్ జైన్‌లు వేర్వేరుగా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10న కేంద్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమైన సమావేశాలు నిర్వహిస్తున్నందున మంగళవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేసినట్లు చెప్పారు. అర్జీదారులు ఈ మార్పును గమనించి 11న ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణికి హాజరుకావాల్సిందిగా సూచించారు.

19న ఐఐసీటీ వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో సెప్టెంబర్ 10న జరగాల్సిన వాక్ ఇన్ ఇంటర్వ్యూ షెడ్యూల్ మారినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 19న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి. సీనియర్ ప్రాజెక్టు అసోసియేట్, అసోసియేట్ ఉద్యోగాలకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయగా... మంగళవారం(10న) ఇంటర్వ్యూ జరగాల్సి ఉంది. కానీ అనివార్య కారణాలతో షెడ్యూల్‌లో మార్పు చేశారు. ఈ మేరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 19న జరిగే వాక్ ఇన్‌కు హాజరు కావాలని ఐఐసీటీ వర్గాలు స్పష్టం చేశాయి.

'కాఫీ విత్ కలెక్టర్'

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతం పెంచేందుకు కృషి చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రోహిణీ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

'ప్రజావాణి'లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, సెప్టెంబర్ 9 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డీఓ వాసుచంద్రతో కలిసి ప్రజల నుంచి 199 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి.. సమస్య పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలన్నారు. భూమి సమస్యలు అధికంగా వస్తున్న క్రమంలో మండల స్థాయిలో పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. రుణ మాఫీపై వస్తున్న ఫిర్యాదుల పట్ల వ్యవసాయ అధికారులు పరిశీలించి రుణమాఫీ.. మాఫీ కాకపోవడానికి గల కారణాలను తెలుసుకొని సమస్య పరిష్కార దిశగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను, రైతుల పొలాల వద్దకు అధికారులు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు, ఇండ్లు దెబ్బతిన్నట్లయితే వివరాలు ఇవ్వాలన్నారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

గణేశ్ నిమజ్జనం ప్రారంభం

- నేటి నుంచి 16 వరకు హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): గణేశ్ నిమజ్జనం ప్రారంభం కావడంతో నేటి నుంచి ఈ నెల 16వ వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. పీవీఎన్‌ఆర్ మార్గ్(నెక్లెస్ రోడ్డు)లో గణేశ్ నిమజ్జనానికి విగ్రహాలను తరలిస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ ఉంటుందన్నారు. ఇందులో భాగంగా షైలింగ్ క్లబ్ టి జంక్షన్, వీవీ విగ్రహం, తెలుగుతల్లి జంక్షన్, తెలుగుతల్లి ఫ్లైఓవర్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ ఎక్స్ రోడ్డు, నల్లగుట్ట బ్రిడ్జి, నల్లగుట్ట పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో 70 ఫిర్యాదులు

రంగారెడ్డి, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలోచిస్తే.. సమస్యకు పరిష్కారం..!

- ఆత్మహత్యాయత్నానికి ముందర ప్రవర్తనలో మార్పు
- గుర్తించి ప్రాణాలు కాపాడాలంటున్న సైకాలజిస్టులు
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : క్షణికావేశంలో జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మోత్కూరి రామచంద్రం అన్నారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని, అనవసర ఆలోచనలతో బంగారు భవిష్యత్తును తుడిచి వేసుకోవద్దని సూచించారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ కౌన్సెలింగ్ ఆత్మహత్య నివారణ కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. ఒత్తిడిని అధిగమించడం పై సూచనలు చేస్తామని తెలిపారు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందున్న లక్షణాలు ఎలా ఉంటాయి? వాటిని ఇంట్లో వాళ్లు ఎలా గుర్తించాలి? వాటిని అధిగమించడానికి బాధితులకు ఎలాంటి ఉపశమనం అందించాలి? తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ''వారిలో వారు ఏదో మాట్లాడుకుంటూ ఉంటారు. ఎవరైనా మాట్లాడాలని చూస్తే పెద్దగా మాటలు కలపరు. ఇతరులతో సంబంధం లేనట్టు ఉంటారు. సూసైడ్ వీడియోలు ఎక్కువగా చూస్తూ ఉంటారు. ''ఒత్తిడి, అశాంతి, భయం, అభద్రత, నిరాశ, తదితర మానసిక కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒటమి, అవమానం భరించలేక కొందరూ సూసైడ్ అటెంప్ట్ చేస్తున్నారు. చిన్న కారణమే అయినా వారికి పెద్ద సమస్యగా కనిపిస్తుంది. వారిని గుర్తించి అండగా ఉంటే ప్రాణాలను కాపాడినవాళ్లమవుతాం.'' అని మోత్కూరి రామచంద్రం పేర్కొన్నారు. కౌన్సెలింగ్ సేవలకు 9533660938 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, ఫైర్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

యాలాల, సెప్టెంబర్ 9 : వినాయక నిమజ్జన ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అన్నారు. సోమవారం తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, ఫైర్, తదితర శాఖల అధికారులతో కలిసి ఆయన.. నిమజ్జన ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కోకట్ కాగ్నా వాగులో 11న జరిగే నిమజ్జన పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కోకట్ కాగ్నా వాగును అధికారులతో కలసి సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ సీఐ సంతోష్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్ మండలం, చందనవెల్లి ప్రభుత్వ దవాఖానను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్, సెప్టెంబర్ 9 : ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి ప్రభుత్వ దవాఖానను ఆయన సందర్శించారు. అనంతరం సిబ్బంది హాజరుపట్టిక, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా ఒక గ్రామంలో వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వెంటనే చుట్టుపక్కల ఇండ్లన్నీ ఫీవర్ సర్వే చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించి పేదలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట స్థానిక డాక్టర్, సిబ్బంది తదితరులున్నారు.

మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు..

- పంచాయతీ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిరసన

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 9 : మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని ఘాన్సిమియాగూడ గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని కోరారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేస్తే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటామన్నారు. గ్రామస్తులకు తెలియకుండా పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, ప్రత్యేకాధికారి వాల్యానాయక్ కలిసి మున్సిపాలిటీలో విలీనం కోసం తీర్మానం పత్రాలను ఉన్నతాధికారులకు అందించారిన ఆరోపించారు. వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో విలీనం చేస్తే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. అనంతరం గ్రామ పంచాయతీ నుంచి హైదరాబాద్–బెంగుళూరు జాతీయ రహదారి వరకు ర్యాలీ చేసి, రోడ్డుపై ఆందోళనకు దిగారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని పంపించారు. కార్యక్రమంలో జగన్‌గౌడ్, రాంనాథ్ ముదిరాజ్, ఆనంద్ ముదిరాజ్, ఇమ్రాన్, రవీందర్ గౌడ్, మల్లేశ్ గౌడ్ నందం, రాజు, లాలప్ప, సురేశ్ గౌడ్, సిద్ధయ్య, ప్రభూ, అభీబ్, గఫార్, కిట్టు ముదిరాజ్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని మోకాళ్ల పై కూర్చొని నిరసన తెలుపుతున్న ఘాన్సిమియాగూడ గ్రామస్తులు

'ప్రజాపాలనలో పారదర్శకత లోపించింది'

సిటీబ్యూరో, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ప్రజావాణిలో పారదర్శకత లోపించిందని, దరఖాస్తుల స్టేటస్ ట్రాక్ చేస్తే అంతా గందరగోళంగా ఉందంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారని రాష్ట్రంలో జవాబుదారీ చట్టం అవసరమని వివిధ ప్రజాసంఘాలకు చెందిన ప్రతినిధులతో కూడిన పీపుల్స్ జ్యూరీ సభ్యులు అభిప్రాయపడ్డారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం 'తెలంగాణలో మరింత పటిష్టమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఆవశ్యకత'పై పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయసేకరణ, విచారణ నిర్వహించారు. మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ వ్యవస్థాపకుడు నిఖిల్ డే, గ్రామ్యరిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ రుక్మిణీరావు, ప్రొఫెసర్ సుజాత సూరేపల్లి, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్ జాతీయ కన్వీనర్ మీరాసంఘమిత్రలతో కూడిన ప్రత్యేక పీపుల్స్ జ్యూరీ ఈ విచారణకు అధ్యక్షత వహించింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజాపాలన, వితంతు పింఛన్లు, అటవీ హక్కుల చట్టం అమలు, పెండింగ్ ఇళ్ల పంపిణీ తదితర అంశాలపై బాధితులు తమ ఫిర్యాదులను తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజావాణి నోడల్ అధికారి, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ రవికిరణ్ మాట్లాడుతూ... ప్రజాభిప్రాయసేకరణలో బాధితులు చెప్పిన సమస్యలు ఉన్నాయన్నారు. అయితే సమస్యల పరిష్కారానికి.. రాజస్థాన్‌లోని జన్‌సూచ్‌నా పోర్టల్ తరహాలో సమాచార పోర్టల్‌ను రూపొందిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రజావాణిని బలోపేతం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. రైతు స్వరాజ్య వేదిక, తెలంగాణ పట్టణ పోరాటాల వేదిక, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ, ఏఎస్ఈఎం, దళిత బహుజన ఫ్రంట్, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, లిబ్టెక్, సోషల్ అకౌంటబిలిటీ ఫోరం ఫర్ యాక్షన్ అండ్ రీసెర్చ్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించాయి.

అర్హత, అనుభవం లేకున్నా వైద్యసేవలు..!

- 'ఇబ్రహీంపట్నం'లో విచ్చలవిడిగా ప్రైవేటు దవాఖానలు
- నర్సులే డాక్టర్ల అవతారం ఎత్తుతున్న వైనం
- ప్రజల జీవితాలతో చెలగాటం.. పట్టని అధికారులు
- ఎస్ఓటీ పోలీసుల రంగప్రవేశంతో బయటపడుతున్న నకిలీ వైద్యుల బాగోతం..

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 9 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నకిలీ వైద్యులు ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. ఎలాంటి అనుభవం, అర్హత లేకున్నప్పటికీ దవాఖానలు ఏర్పాటుచేసి అమాయక ప్రజల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటున్నారు. ముఖ్యంగా సీజనల్ కాలం కావడంతో ప్రజలు పెద్ద ఎత్తున మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గున్యాతో పాటు ఇతర శ్వాస సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని ఆసరగా చేసుకుని అర్హత, అనుభవం లేని డాక్టర్లు వైద్యసేవలు అందిస్తుండటంతో చాలామంది ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. ఇబ్రహీంపట్నంలో ఇటీవల కాలంలో ప్రైవేటు ఆస్పత్రులు పెద్ద ఎత్తున పుట్టుకొస్తున్నాయి. ఈ ఆస్పత్రుల్లో ఎలాంటి అనుభవం, అర్హత లేని డాక్టర్లు వైద్యం అందిస్తునట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్న చాలా దవాఖానల్లో నర్సు లే డాక్టర్లుగా అవతాతరమెత్తి వైద్యసేవలందిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు రంగంలోకి దిగి ఆదివారం ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అర్హత లేకుండానే డాక్టర్‌గా చలామణి అవుతూ...వైద్యసేవ లందిస్తుండటంతో అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆస్పత్రిలో నర్సు డాక్టర్‌గా పేరు మార్చుకుని చలామణి అవుతున్న విషయాన్ని గుర్తించి ఆమెపై కేసు నమోదు చేశారు. అలాగే.. మంచాల రోడ్డులోని ఓ ఆస్పత్రిలో డెంగీ వ్యాధి సోకిన బాలుడికి సరైన వైద్య సౌకర్యం అందక మృతి చెందాడు. ఇబ్రహీంపట్నంతో పాటు వివిధ గ్రామాల్లో కూడా పెద్ద ఎత్తున ఆస్పత్రులు ఏర్పాటుచేసి ఎలాంటి అర్హతలేని వారిచేత వైద్యం చేయిస్తున్నారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లోని అనేక గ్రామాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యపరీక్షల పేరుతో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తుండటంతో పాటు ఆస్పత్రిలోనే కాలం చెల్లిన మందులను కూడా అందిస్తున్నట్లు సమాచారం. కొన్ని దవాఖానల్లో అవసరం లేకున్నా అడ్మిట్ చేసుకుని వేల రూపాయల మందులు రాసి.. మెడికల్ షాపుకు పంపించి.. తిరిగి వాటిని అందులోనే విక్రయిస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. అర్హత లేని వైద్యులను కలిసేందుకు కూడా ఆయా ఆస్పత్రుల్లో రోగులు ముందుగా రూ.300నుంచి రూ.1000 ఓపీ ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇబ్రహీంపట్నంలో సరైన వైద్యం అందక బాలుడు మృతిచెందటంతో ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు (ఫైల్)

అర్హతలేని వారు వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు

అర్హత, అనుమతులు లేకుండా దవాఖానలు నడిపేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఎలాంటి అర్హత లేకుండా నర్సు స్థాయి సిబ్బంది కూడా వైద్యసేవలు అందిస్తే చర్యలు తప్పవు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రైవేటు ఆస్పత్రుల్లో నకిలీ వైద్యులు కొనసాగుతున్నట్లు తమకు సమాచారముంది. ఇకపై ప్రైవేటు ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా పెట్టి.. తనిఖీలు చేపడుతాం.. నకిలీ వైద్యులు అని తేలితే వారిపై కఠన చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, డీఎంఎచ్ఓ

తెలంగాణ సాహిత్యానికి నిలువెత్తు నిదర్శనం కాళోజీ

- మంత్రి జూపల్లి కృష్ణారావు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 9 : పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు తెలంగాణ సాహిత్యానికి, సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనమని, తెలంగాణ యాసకు, భాషకు జీవం పోసిన ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదిన మహనీయుడని పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ నారాయణరావు 110 జయంతి వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి అధ్యక్షతన జరిగిన కాళోజీ జయంతి సందర్భంగా.. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ–మానవతా విలువలు అనే అంశంపై సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళోజీ స్వాతంత్ర్య సమర యోధుడిగా , సామాజిక ఉద్యమకారుడిగా, కవిగా తెలంగాణ సమాజానికి చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. అన్యాయం ఎక్కడ జరిగినా కాళోజీ గళమెత్తేవారని, అసమానతలు, దోపిడీ, నిరాదరణకు గురవుతున్న వారిలో ఆయన కలం చైతన్యం నింపిందని గుర్తు చేశారు. ముఖ్యంగా స్థానిక భాషను రాయాలని, ఇతరుల భాషను అనుకరించే బానిస భావన పోవాలన్నారు. ఆయన తపించిన తీరుతో ప్రతి ఒక్కరిలో ఆత్మగౌరవం వెల్లువిరిసిందన్నారు. కాళోజీ కవితా సంకలనం, నా గొడవలో ఆయన రాసిన అనేక పద్యాలను ఉటకిస్తూ.. ఆయన కవితాశక్తిని , బావుకతను, పోరాట ప్రతిభను, తెలంగాణ తపనను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అంతటి మహనీయుడు తెలంగాణ గడ్డపై పుట్టడం మనందరికీ గర్వకారణమని కొనియాడారు.70 మంది కవులు తమ కవితలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సాహి త్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, టూరిజం, క్రీడ ల ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, అందెశ్రీ పాల్గొన్నారు.

కులగణన, 42 శాతం రిజర్వేషన్లే లక్ష్యం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 9 : బీసీల కులగణన, 42 శాతం రిజర్వేషన్లే ఏకైక లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ బీసీ జన సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం సమితి అధ్యక్షుడు జస్వంత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ... దశాబ్దాలుగా బీసీలకు పాలక పార్టీలు వల్ల అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కులగణన చేపట్టి, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ జాతీయ నేత రాహుల్ గాంధీ స్పష్టంగా చెబుతున్నారని, కులగణన కోసం పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు పెట్టాలని డిమాండ్ చేయడం స్వాగతించాల్సిందేనన్నారు. రాష్ట్రంలోనూ అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేసే విధంగా చొరవ తీసుకుంటానని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీసీ నినాదం ఎత్తుకున్నా ఎవరూ నమ్మలేదని, ఫలితంగా 240 సీట్లకు పడిపోయిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హామీలను వెంటనే అమలు చేయాల్సిన బాధ్యత పాలక కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో టీజేఎస్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్, బైరి రమేశ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, మహిళా విభాగం కన్వీనర్ లక్ష్మి, విద్యార్థి విభాగం నాయకులు అరుణ్ కుమార్, రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు సాయికుమార్ ముదిరాజ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదులు, బీసీ సంఘం నాయకులు దేవిక పాల్గొన్నారు.

రోడ్లు గుంతలుగా మారినా పట్టదా..!

బురద రోడ్డుపై వరినాట్లువేసి బీజేపీ నేతల నిరసన

పూడూరు, సెప్టెంబర్ 9 : వర్షాలకు రోడ్లు బురదమయంగా మారినా అధికారులు పట్టించుకోవడంలేదని, ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ అన్నారు. దీనికి నిరసనగా సోమవారం పూడూరు మండలం, కంకల్ గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఉన్న బురద నీటిలో రవీందర్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు, మహిళలు వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలానికి ముందే అధికార పార్టీ ముఖ్య నాయకులు మండల పరిధిలోని అన్ని గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతామని హామీ ఇచ్చి.. ఇప్పటి వరకు ఒక్క బీబీ రోడు పనులు కూడా చేపట్టలేదని ఆరోపించారు. వికారాబాద్ జిల్లా హైదరాబాద్–బీజాపూర్ హైవే నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు రంగారెడ్డి జిల్లా లాల్‌పహాడ్ చౌరస్తా వరకు 22 కిలోమీట్లర దూరంగా ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు సరిగ్గాలేక ఆర్టీసీ బస్సులను సైతం నడపడంలేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్పందించి అంగడిచిట్టంపల్లి, చన్గోముల్, మేడిపల్లికలాన్, కంకల్, లాల్‌పహాడ్ వరకు రోడ్డు పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.రవీందర్, రాంచంద్రయ్య, విఠల్, అశోక్, చంద్రశేఖర్, శివకుమార్, శ్రీను , మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పూడూరు మండలం, కంకల్ గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు, మహిళలు